సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- 8లో ▸



బస్సులు ఫుల్..

ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఉన్నప్పటికీ మహిళలు బస్సుల కోసమే వేచి చూస్తున్నారు. దీంతో ఆటోలు వెలవెలబోతున్నాయి.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

39.0 /17.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి రేషన్ పంపిణీ

కామారెడ్డి రూరల్: జిల్లాలో శనివారం నుంచి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం అవుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. అయితే ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేది వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు పేర్కొన్నారు.

మార్చి 1న బైక్ సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మార్చి 1న మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీలకు జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7 నుంచి 9వరకు హైదరాబాద్‌లో జరుగనున్న 9వ రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్‌సైక్లింగ్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు అండర్ 14, 16 ,18 బాలురు, బాలికలు, పురుషులు, మహిళలు విభాగంలో ఎంపికలు చేపడతామన్నారు. ఆసక్తి కలవారు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం ఏడు గంటలకు రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99128 83331ను సంప్రదించాలన్నారు.

బొంతలే.. తలుపులు



బాల్కొండ: ముప్కాల్ కేజీబీవీలో మరుగుదొడ్లకు, మూత్రశాలలకు ప్రధాన ద్వారాలకు అతుకుల బొంతలనే అడ్డుగా పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం పనులు కొనసాగుతుండగా.. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న అద్దె భవనంలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.







ఓటు వేసిన కలెక్టర్ సంగ్వాన్ అదనపు కలెక్టర్లు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే గంప



ఓటర్లకు స్లిప్పులను అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



తాద్వాయిలో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్



కామారెడ్డిలోని బాయ్స్ హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

- ఉపాధ్యాయుల ఆసక్తి.. పట్టభద్రుల అనాసక్తి..!
- ఓటేసిన టీచర్లు 93.63 శాతం.. పట్టభద్రులు 78.12 శాతం
- ఓటు హక్కు వినియోగించుకున్న అధికారులు.. ప్రజాప్రతినిధులు.. మాజీ ప్రజాప్రతినిధులు

శాసన మండలి ఎన్నికల ఓటింగ్‌లో టీచర్లు ఉత్సాహంగా పాల్గొనగా, పట్టభద్రులు అంతగా ఆసక్తి చూపలేదు! జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 54 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తోపాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఎస్పీ సింధుశర్మ, ఏఎస్పీ చైతన్యరెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మొదటిసారి ఓటు హక్కు వచ్చిన పట్టభద్రులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో క్యూ కట్టిన ఓటర్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ - కరీంనగర్ - ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 ఉపాధ్యాయ, 29 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ నమోదు కాగా, మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగింది. మధ్యాహ్నం తరువాత ఓటర్లు కేంద్రాలకు పోటెత్తారు. జిల్లా కేంద్రంతోపాటు ఆయా మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఎస్పీ సింధుశర్మ, ఏఎస్పీ చైతన్యరెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాగా కామారెడ్డి పట్టణంలో పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్ ఓటేశారు. పిట్లంలోని పోలింగ్ కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్ ఓటేశారు. కాగా జిల్లా కేంద్రంతోపాటు ఆయా మండలాల్లో కాంగ్రెస్, బీజేపీ నేతలు పట్టభద్రుల ఓట్ల కోసం పోలింగు కేంద్రాలకు సమీపంలో టెంట్లు వేసుకుని కూర్చున్నారు. కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఓటర్లకు స్లిప్పులు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు తాము ఏర్పాటు చేసుకున్న టెంట్లలో కూర్చుని ఓటర్లకు స్లిప్పులు అందజేయడంతోపాటు పోలింగ్ కేంద్రాల వివరాలను తెలిపారు.

భిక్కనూరులో స్వల్ప ఉద్రిక్తత



భిక్కనూరులో పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం బయట స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులుతో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై మాట్లాడుతుండగా దూరంగా వెళ్లాలని పోలీసులు సూచించారు. తాము నిబంధనల ప్రకారమే పోలింగ్ కేంద్రానికి దూరంలో ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ బీజేపీ నాయకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సీఐ సంపత్‌కుమార్ అక్కడికి వచ్చి వారిని శాంతింపజేశారు. భిక్కనూరుకు వచ్చిన ఏఎస్పీ చైతన్యరెడ్డి రోడ్డు పక్కన వేసిన టెంట్లను తొలగించాలని సూచించడంతో పోలీసులు తొలగించారు.

లింగంపేటలో బీజేపీ నాయకుల నిరసన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన తిరిగి వెళ్తున్న సమయంలో సహకార సంఘం వద్ద జనాలు గుమిగూడి ఉండడాన్ని గమనించి సిబ్బందితో కలిసి వారిని పంపించారు. ఈ క్రమంలో అక్కడే నిలబడి ఉన్న బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాంచందర్‌పై డీఎస్పీ చేయిచేసుకున్నారు. తాను నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి దూరంగా లైన్‌దాటి ఉన్నా డీఎస్పీ దాడి చేశాడని రాంచందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఐజీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల వివరాలు

డివిజన్	ఓట్లు	పోలైనవి	శాతం
కామారెడ్డి	1331	1242	93.3
ఎల్లారెడ్డి	163	151	92.64
బాన్సువాడ	517	490	94.78
మొత్తం	2011	1883	93.63

పట్టభద్రుల ఓట్ల వివరాలు

డివిజన్	ఓట్లు	పోలైనవి	శాతం
కామారెడ్డి	9350	7160	76.6
ఎల్లారెడ్డి	2655	2211	83.28
బాన్సువాడ	4405	3449	78.30
మొత్తం	16,410	12,820	78.12

ఉపాధ్యాయుల్లో ఉత్సాహం

పోలింగ్‌లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 2011 ఓట్లకుగాను 1,883 ఓట్లు పోలయ్యాయి. 93.63 శాతం పోలింగ్ నమోదైంది. కామారెడ్డిలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి మధ్యాహ్నం నుంచి టీచర్లు భారీ సంఖ్యలో తరలివచ్చి వరుస కట్టారు. కేవలం 128 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు.

పట్టభద్రులు అంతంతే...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందుకు జిల్లాకు చెందిన పట్టభద్రులు పెద్దగా ఆసక్తి చూపలేదు. 16,410 ఓట్లకు గాను 12,820 ఓట్లు పోలయ్యాయి. అంటే 78.12 శాతం మంది ఓట్లేశారు. ఓటింగ్ శాతం పెరుగుతుందని భావించినప్పటికీ పట్టభద్రులు చాలా మంది ఓటు వేయడానికి రాలేదు. 3,590 మంది పట్టభద్రులు ఓటు వేయలేదు.

ఓటు హక్కు వినియోగించుకోని వారు

పట్టభద్రులు	:	3,590
టీచర్లు	:	128



నస్రుల్లాబాద్ మండలం మైలారంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. రాజరాజేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. కొబ్బరికాయతో ప్రారంభమైన కుస్తీ పోటీలు రూ.2వేల నగదు బహుమతి వరకు సాగాయి. విజేతలను నిర్వాహకులు సన్మానించారు.

– నస్రుల్లాబాద్(బాన్సువాడ)

కొత్త కోర్సులుంటేనే అనుమతి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గత నాలుగు సంవత్సరాల డిగ్రీ ప్రవేశాల వివరాలు

విద్యా సంవత్సరం	అందుబాటులో సీట్లు	డిగ్రీలో చేరిన విద్యార్థులు	మిగిలిన సీట్లు
2021-22	34,370	17,960	16,410
2022-23	26,980	14,564	12,416
2023-24	33,630	14,046	19,584
2024-25	33,830	12,764	21,764



- డిగ్రీలో సమూల మార్పులు?
- ప్రాజెక్టు వర్క్ ఉండేలా కొత్త సిలబస్
- ఈ ఏడాది పలు కళాశాలలకు అనుమతి కష్టమే..
- కనుమరుగు కానున్న దోస్త్..!

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది సమగ్రంగా మారబోతోంది. 'డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్)' తెరమరుగు కానుంది. దాని స్థానంలో పాత పద్ధతిలోనే కాలేజీలు సొంతంగా అడ్మిషన్లు చేపట్టబోతున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యామండలి కసరత్తు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే డిగ్రీ ప్రవేశాల విధి విధానాలను ఖరారు చేయనున్నారు. అయితే కోర్సుల ఏర్పాటు, అనుమతులు విద్యామండలి అధీనంలోనే ఉంటాయని, ఏయే కోర్సులకు, ఏయే కాలేజీలకు అనుమతించాలనేది మండలి నిర్ణయిస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సుమారు 15 డిగ్రీ కాలేజీలకు అనుమతి రద్దయ్యే అవకాశాలున్నాయి. కొత్త విధి విధానాలు వచ్చిన తర్వాత అందుకు తగిన విధంగా కోర్సులు ఉంటే తప్ప కాలేజీలకు అనుమతి లభించడం కష్టమని అధికారులు పేర్కొంటున్నారు.

డిగ్రీ సీట్లకు కోత

తెయూ పరిధిలో ప్రస్తుతం 74 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. అందులో 13 ప్రభుత్వ, 54 ప్రైవేటు, ఎయిడెడ్, రెసిడెన్షియల్ (గురుకులాలు) డిగ్రీ కాలేజీల్లో కలిపి సుమారు 34,500 సీట్లు ఉన్నాయి. అయితే కొన్నేళ్లుగా డిగ్రీ ప్రవేశాలు 40 నుంచి 50 శాతానికి మించడం లేదు. ముఖ్యంగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో అయితే ఇది 25 శాతమే. నిజానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారంతా డిగ్రీలో చేరినా ఇంకా సీట్లు మిగిలిపోయే పరిస్థితి. ఇలా విద్యార్థులు తక్కువ, సీట్లు ఎక్కువ ఉండటంపై ఉన్నత విద్యా మండలి ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలోని డిగ్రీకాలేజీల్లో భర్తీ అవుతున్న సీట్లలో సగానికిపైగా సీట్లు కొత్త కోర్సులకు సంబంధించినవే ఉంటున్నాయి. బీకాం ఫైనాన్స్, కంప్యూటర్స్ వంటి కాంబినేషన్ సబ్జెక్టులకు డిమాండ్ ఉంది. ఆ తర్వాత స్థానంలో బీఎస్సీ కంప్యూటర్స్, లైఫ్‌సైన్స్ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. కానీ ఈ కోర్సులు అన్ని కాలేజీలలో లేవు. అధిక సంఖ్యలోని కాలేజీల్లో ఇప్పటికీ సాధారణ డిగ్రీ కోర్సులే ఉన్నాయి. కాంబినేషన్ కోర్సులు ఎక్కువ భాగం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లోనే ఉంటున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని యూజీసీ, ఉన్నత విద్యా మండలి డిజైన్ చేసిన కోర్సులను అందుబాటులోకి తెచ్చిన కాలేజీలకే అనుమతివ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో తెయూ పరిధిలో సైతం దాదాపు 16 వేల సీట్లు తగ్గిపోయే అవకాశాలున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

కొత్త సిలబస్ అందుబాటులోకి..

ఉన్నత విద్యామండలి 2025-26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. సాధారణ డిగ్రీలో కంప్యూటర్ కోర్సులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి సబ్జెక్టులను అందుబాటులోకి తేనుంది. ఈ దిశగా నిపుణులు సిలబస్‌ను రూపొందించారు. దీనికి అవసరమైన మౌలిక సదు పాయాలను కాలేజీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ కోర్సులను బోధించేందుకు నిపుణులైన అధ్యాపకులు అవసరం. కొత్త సిలబస్‌లో తరగతి గదిలో బోధనతో సమానంగా నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రెండో ఏడాది నుంచే ప్రాజెక్టు వర్క్ ప్రవేశ పెడుతున్నారు. ఏఐ కోర్సు తీసుకునే విద్యార్థులు ఏదైనా ప్రముఖ కంపెనీ తోడ్పాటుతో సొంతంగా సరికొత్త ప్రాజెక్టు చేయాల్సి ఉంటుంది. రెండో ఏడాది మినీ ప్రాజెక్టు, మూడో ఏడాది పెద్ద ప్రాజెక్టును చేపట్టాలి. దీని కోసం కాలేజీలు కొన్ని సంస్థలతో భాగస్వామ్య ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ఎంవోయూ ఉన్న కాలేజీలకు మాత్రమే ఈసారి అనుబంధ గుర్తింపు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి భావిస్తున్నట్టు తెలిసింది. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యేలోగా ఈ మార్పులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.


రుణమాఫీ కాదేమీ..!?

- లక్షా 201 మంది రైతులకు రూ.717 కోట్లు..
- నాలుగు విడతల్లో నిధులు జమ
- సాంకేతిక సమస్యలతో చాలా మందికి వర్తించని మాఫీ
- రూ.2లక్షలకు పైగా రుణాలున్న వారి సంగతేమిటో..?

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో రుణమాఫీ ప్రధానమైనది. జిల్లాలో మొత్తం 1.98 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందగా, నాలుగు విడతల్లో మొత్తం 1,00,201 మంది రైతులకు రూ.717 కోట్ల రుణ మాఫీ వర్తించింది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా ఇప్పటి వరకు రుణాలు మాఫీ కాని వారితోపాటు కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతులు రుణమాఫీ ఎప్పుడొస్తుందని ఎదురు చూస్తున్నారు.

నాలుగు విడతల్లో ..

జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో 1,98,374 మంది రైతులు రుణాలు పొందారు. రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేయాలంటే రూ.1,283.14 కోట్లు అవసరం ఉండేవి. కానీ అర్హుల జాబితా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులను మినహాయించడంతో మొత్తంలో కొంత తగ్గింది. మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణాలున్న 49,540 మంది రైతులకు రూ.231 కోట్లు, రెండో విడతలో 24,816 మందికి రూ.212 కోట్లు, మూడో విడతలో 16,903 మంది రైతులకు రూ.203 కోట్ల రుణమాఫీ వర్తించింది. రేషన్ కార్డులు లేక, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పిదాలు వంటి సాంకేతిక సమస్యల కారణంగా చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. చాలా మందికి రేషన్ కార్డులు లేకపోవడాన్ని మొదటి విడతలోనే ప్రభుత్వం గుర్తించి కుటుంబ నిర్ధారణ సర్వే చేపట్టింది. సర్వే పూర్తయ్యాక నాలుగో విడతలో రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న మరో 8,942 మంది రైతులకు రూ.71.01 కోట్లు జమ చేశారు.



ఒక కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటే.. కుటుంబంలోని ఇద్దరు లేదా ముగ్గిరి పేరు మీద ఉన్న పంట రుణాల మొత్తం కలిపి రూ.2 లక్షలు దాటిన వారికి ఇప్పటి వరకు రుణమాఫీ వర్తించలేదు. అటువంటి కుటుంబాలు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నాయి. ఇవే కాకుండా పథకాన్ని ప్రారంభిన నాటి నుంచి ఇప్పటిరకు జిల్లా వ్యాప్తంగా తమ కు రుణ మాఫీ రాలేదంటూ వ్యవసాయ శాఖ అధికారుల కు దాదాపు 10 వేల ఫిర్యాదులు అందాయి. వాటిలో సగానికి పైగా రైతుల సమస్యలు పరిష్కారం కావడంతో నాలు గో విడతలో రుణం మాఫీ అయ్యింది. మిగతా వారి సమస్యలు అలాగే ఉండిపోయాయి. రుణమాఫీ వర్తించని వారి సమ స్యలను పరిష్కరించంతోపాటు రూ.2లక్షలకు పైగా రుణాలు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రుణమాఫీ నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇంకా ఎదురు చూపులే..

రుణమాఫీ రాలేదు



నాతోపాటు నా భార్య పేరు మీద రెండు ఖాతాలకు కలిపి రూ.1.60 లక్షల పంట రుణం ఉంది. ఆధార్ నంబర్ తప్పుందని రుణ మాఫీ వర్తించలేదు. సహకార అధికారులు సరి చేస్తామన్నారు. ఎదురుచూస్తున్నాం.

– భూంరెడ్డి, రైతు, గాంధారి

ఉన్నతాధికారులకు నివేదించాం



రూ.2 లక్షలకుపైగా రుణాలున్న కుటుంబాల వివరాలను ఇదివరకే ప్రభుత్వానికి పంపించాం. సాంకేతిక సమస్యల కారణంగా రుణ మాఫీ వర్తించని వారి వివరాలు ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం అయ్యేలా చూస్తున్నాం. – తిరుమల ప్రసాద్, డీఏవో

క్లుప్తంగా

న్యాయవాది మృతిపై సంతాపం



ఆర్మూర్‌టౌన్: బోధన్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది కె ఎల్లయ్య మృతికి సంతాపంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం న్యాయవాదులు విధులకు హాజరుకాలేదు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, న్యాయవాదులు నరేందర్, తాజొద్దీన్, అశోక్, ప్రవీణ్, హరివర్ధన్, సైఫొద్దీన్, శ్యామ్, రాజేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

ఖలీల్‌వాడి: జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో గురువారం బోధన్ సీనియర్ న్యాయవాది కంటే ఎల్లయ్య సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ఎల్లయ్య మృతి చాలా బాధాకరమన్నారు. సంతాప సూచకంగా న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం న్యాయస్థానాల విధులకు దూరంగా ఉండాలని తీర్మానించినట్లు తెలిపారు. బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి, బార్ ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి దొన్పల్ సురేష్, కోశాధికారి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో జిల్లావాసి!

ఖలీల్‌వాడి: మహారాష్ట్ర రాష్ట్రంలోని సేలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా నిజామాబాద్ నగరంలోని మాలపల్లికి చెందిన ఎస్‌కే కమరోద్దిన్‌గా తెలిపాడన్నారు. మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారు గురువారం నిజామాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎవరైనా అతడి సమాచారం తెలిసిన వారు నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట: నవీపేట, రాంపూర్, కమలాపూర్ గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నందున వీటి పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే మండలంలోని కోస్లీ, యంచ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీ కాలనీకి చెందిన వనం సంగీత అనే వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 25న బంధువుల ఇంటికని వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త పాపయ్య చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఈమేరకు పాపయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 2580 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటాపోటీగా ప్రచారం


బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రచారం


మరోపక్క మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం ప్రచారం

- అధిపత్యం కోసం ఇరువర్గాల నేతలు

బాన్సువాడ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాన్సువాడలో ఇరువర్గాల నేతలు పోటాపోటీగా ప్రచారం చేశారు. ఒక పక్క వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ల వర్గం ప్రచారం చేస్తే మరో పక్క మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇరు వర్గాల నేతలు టెంట్లు ఏర్పాటు చేసుకుని మరీ ఆధిపత్యం కోసం విశ్వ ప్రయత్నం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి పోటీ చేస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. గత పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం మొక్కవోని దీక్షలా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపునకు కృషి చేసి బాన్సువాడ నియోజకవర్గం నుంచి దాదాపు 10 వేల మెజార్టీ వచ్చేందుకు దోహదపడ్డారు.

మారిన పరిస్థితుల్లో ఎంపీ ఎన్నికల తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పోచారం కాంగ్రెస్‌లో చేరగానే ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పోచారంతో కలిసి పని చేస్తున్నారు. అప్పటి నుంచి పోచారం, కాసుల వర్గం ఒకవైపు ఉంటే మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గం మరోవైపు ఉంటున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇరు వర్గాల నేతలు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం విస్తృత ప్రచారం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఇరు వర్గాల నేతలకు రెఫరెండంగా మారనున్నాయి. మరో రెండు రోజులు ఆగితే ఎమ్మెల్సీ ఫలితాలు తేలనున్న నేపథ్యంలో బాన్సువాడలో ఏ మేరకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓట్లు పడతాయోనని అందరూ వేచి చూస్తున్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యేల పూజలు


మద్నూర్ శివాలయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు


సోమలింగాల వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సోమలింగాల శివాలయాన్ని గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అక్షయ్ మఠపతి, ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి ఆలయ చరిత్రను వివరించారు.

సోమలింగాల శివాలయంలో అన్నదానం

మండల కేంద్రానికి సమీపంలోని సోమలింగాల శివాలయంలో గురువారం శివరాత్రి మరుసటి రోజు సందర్భంగా భక్తులు సోమలింగాల ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి భజనలు, కీర్తనలతో జాగరణ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

దుర్కిలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కిలో గురువారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచారం సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అన్నదానాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

బీజేపీ విజయం తథ్యం



సుభాష్‌నగర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ సరళి, పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే బీజేపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్, పాలిటెక్నిక్, సీఎస్‌ఐ, నిర్మల హృదయ కళాశాలలోగల పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఓటుహక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఉపాధ్యాయులు, పట్టభద్రులకు స్లిప్పులు అందజేశారు. ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించబోతుందని, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక పూజలు.. భజనలు.. అన్నదానాలు


లింగంపేట: కొర్పోల్‌లో శివపార్వతుల కల్యాణం జరుపుతున్న వేదపండితులు


ఎల్లారెడ్డి: రాజరాజేశ్వరాలయంలో..


భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో భజన కార్యక్రమం

మహాశివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను మొదటి రోజు దర్శనం చేసుకోని భక్తులు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో గురువారం అన్నదానాలు నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల భజన కార్యక్రమాలు అలరించాయి. ఆలయాల చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


బాన్సువాడ: కోట దుర్గాదేవి ఆలయంలో


నాగిరెడ్డిపేట: త్రిలింగేశ్వరాలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన


రాజంపేట: రాజరాజేశ్వర ఆలయంలో..


కామారెడ్డిఅర్బన్: సాయిబాబా ఆలయ ప్రాంగణంలో..


రాజంపేట: రాజరాజేశ్వర ఆలయం వద్ద అన్నదానం


తిమ్మాపూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్తులు

పోలింగ్ సరళి పర్యవేక్షణ


వెబ్‌క్యాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఈవో కార్యాలయం, గ్రంథాలయంలలో ఒక్కోటి చొప్పున, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్‌లు సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ముగ్గురూ అక్కడే ఓటు వేశారు. ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలన..

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అనుసంధానం చేయడం ద్వారా కలెక్టరేట్ నుంచి వెబ్‌క్యాస్టింగ్ ద్వారా జిల్లాలో జరుగుతున్న పోలింగ్ సరళిని కలెక్టర్, అధికారులు గురువారం సాయంత్రం వరకు పరిశీలించారు. పోలింగ్ అధికారులు సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.


కామారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

పోలింగ్ వివరాలు అంకెల్లో..

బాన్సువాడ /కామారెడ్డి క్రైం/నాగిరెడ్డిపేట : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. మండలాలవారీ గా పోలైన ఓట్లు, ఓట్ల శాతం ఈ విధంగా ఉన్నాయి.

పట్టభద్రులు.. మండలాలవారీగా నమోదైన పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం	మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
కామారెడ్డి	4318	3126	72.39	మహ్మద్‌నగర్	221	170	76.92
మాచారెడ్డి	379	311	82.00	నస్రుల్లాబాద్	326	268	82.21
భిక్కనూర్	998	772	77.35	నిజాంసాగర్	190	153	80.53
బీబీపేట	536	428	79.08	పెద్దకొడప్‌గల్	211	142	67.30
రాజంపేట	444	360	81.06	పిట్లం	487	402	82.55
దోమకొండ	498	415	83.33	నాగిరెడ్డిపేట	350	290	84
పాల్వంచ	342	295	86.25	ఎల్లారెడ్డి	827	701	84.76
బాన్సువాడ	1112	930	83.63	లింగంపేట	765	638	83
బిచ్కుంద	639	460	71.99	తాడ్వాయి	671	569	84.71
బీర్కూర్	348	298	85.63	గాంధారి	713	599	83
డోంగ్లీ	107	81	75.70	రామారెడ్డి	472	397	84
జుక్కల్	347	231	66.57	సదాశివనగర్	692	541	78.17
మద్నూర్	417	314	75.30	మొత్తం	16.410	12.820	78.12

ఉపాధ్యాయులు.. మండలాలవారీగా నమోదైన పోలింగ్ వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం	మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
కామారెడ్డి	941	869	92.34	మహ్మద్‌నగర్	14	14	100.00
మాచారెడ్డి	15	15	100	నస్రుల్లాబాద్	44	42	95.45
భిక్కనూర్	109	101	92.64	నిజాంసాగర్	9	9	100.00
బీబీపేట	40	40	100	పెద్దకొడప్‌గల్	18	18	100.00
రాజంపేట	20	20	100	పిట్లం	49	44	89.80
దోమకొండ	57	55	96.50	నాగిరెడ్డిపేట	21	20	95
పాల్వంచ	15	14	93.3	ఎల్లారెడ్డి	81	76	93.82
బాన్సువాడ	186	178	95.70	లింగంపేట	32	30	94
బిచ్కుంద	83	78	93.98	తాడ్వాయి	44	41	93.18
బీర్కూర్	37	37	100.00	గాంధారి	27	25	92
డోంగ్లీ	11	10	90.91	రామారెడ్డి	36	36	100
జుక్కల్	17	14	82.35	సదాశివనగర్	54	51	94.44
మద్నూర్	49	46	93.88	మొత్తం	2,011	1,883	96.63

రెండు పార్టీలదే హడావుడి

- పోలింగ్ కేంద్రాల సమీపంలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల ప్రచారం
- ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్ ఘట్టం

సుభాష్‌నగర్/వేల్పూర్/నిజామాబాద్ రూరల్/మోర్తాడ్: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానమైన పోలింగ్ ఘట్టం గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలదే హడావిడి కనిపించింది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడ చూసిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ప్రచారమే కనిపించింది. బీఆర్‌ఎస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి ఇతర స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్న వారు ఎక్కడ కూడా తమ ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన ఆనవాలు లేవు. చివరి క్షణం వరకు సామాజిక మాధ్యమాల్లో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కొనసాగించడం గమనార్హం. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆఖరి క్షణం వరకు ఓట్ల కోసం నగదు పంపకాలు కొనసాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థి పోలింగ్ రోజున కూడా ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున అందించినట్లు సమాచారం. మరో ప్రధాన పార్టీ డబ్బులకు బదులుగా మందు పార్టీలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు భారీగానే తరలివచ్చారు. ఎన్నికల్లో జిల్లాలోని ప్రధాన పార్టీల నేతలు, ప్రముఖులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేల్పూర్‌లో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలంలో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, కమ్మర్‌పల్లిలో బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వారు ఓటుకు దూరం..

మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ మండలం కిసాన్ నగర్‌కు చెందిన ఈరవత్రి అనిల్ ఇంజినీరింగ్ పట్టభద్రుడు కాగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సైతం ఇంజినీరింగ్ పట్టభద్రుడు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం వేల్పూర్ మండలంలో దరఖాస్తు చేసుకున్నారు. కానీ అనివార్య కారణాల వల్ల ఢిల్లీ పర్యటనలో ఉండటంతో ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన మాజీ స్పీకర్, రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి పీజీ చదివారు. ఆయన కమ్మర్‌పల్లి మండలంలో ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా వ్యక్తిగత కారణాలతో ఓటు హక్కును పొందలేరు. తెలంగాణ ఉద్యమ జేఏసీ వ్యవస్థాపకుడు రాజారాం యాదవ్ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన వారు. ఆయనకు ఏర్గట్ల మండలంలో పట్టభద్రుల ఓటు హక్కు ఉంది. ఆయన కూడా వ్యక్తిగత కారణాలతో ఓటును వినియోగించుకోలేకపోయారు.

ఉపాధ్యాయుల ఓట్లు గల్లంతు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దశరథ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అతను ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఓటు హక్కు రాలేదు. ఇదే కళాశాలలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మరో వ్యక్తి అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. అతనికి మాత్రం నివాసం ఆధారంగా నిజామాబాద్‌లో ఓటు హక్కును కల్పించారు. ఇది ఒక్క దశరథ్‌కు ఎదురైన సమస్యనే కాదు. ఎంతో మంది డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న పొరుగు జిల్లాల అధ్యాపకులకు ఎదురైన సమస్య. ఓటు హక్కు కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం కార్నర్

అత్తింటి వేధింపులకు వివాహిత బలి


రజిత(ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధింపులకు గురిచేయగా, ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ధ్యాకం గల్లీకి చెందిన జమేదార్ సాయిలుకు రెంజల్ మండలం బాగెపల్లి గ్రామానికి చెందిన రజితతో 15ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సాహితి, శ్రీనిధి ఇద్దరు కూతుళ్లు ఉన్నారన్నారు. ఇటీవల భర్త సాయిలు, అత్తలు లక్ష్మి, నాగమణి, బావ నగేష్, మరిది రాజా అదనపు కట్నం కోసం రజితను వేధించారు. దీంతో ఆమె తండ్రి సాయిలు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సముదాయించారు. కానీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతోపాటు మళ్లీ అదనపు కట్నం కోసం వేధించగా రజిత ఈనెల 24న రాత్రి ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే మంటలు చెలరేగడంతో భర్త, స్థానికులు ఆమెను బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకట నారాయణ వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని పంబోలి ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మూడోటౌన్ ఎస్సై హరిబాబు గురువారం తెలిపారు. మృతుడు రెండు రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, వయస్సు సుమారు 40 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని అన్నారు. ఒంటిపై బూడిద కలర్ షర్టు, బూడిద కలర్ పాయింట్ ధరించి ఉన్నాడని. బిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నామన్నారు.

ధర్పల్లి మండల కేంద్రంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఊర చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై రామకృష్ణ గురువారం తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. మృతుడు తెలుపు , నలుపు రంగు గీతల చొక్కా, తెలుపు రంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యక్తికి సంబంధించిన వివరాల కోసం ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, ఎవరైనా అదృశ్యమైతే.. వారి సంబంధీకులు వచ్చి శవాన్ని సరిపోల్చుకోవాలని ఎస్సై సూచించారు.